క్లుప్తంగా

వలంటీర్ల సేవలు మరువలేం



వలంటీర్లను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

మాకవరపాలెం: సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేమని వైస్ ఎంపీపీ తుల్లు రాజారావు, రామన్నపాలెం సర్పంచ్ మాకిరెడ్డి అయ్యప్ప తెలిపారు. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం రామన్నపాలెం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వర ప్రసాద్, వీఆర్వో సింహాద్రి పాల్గొన్నారు.

సుందరకోట పాఠశాలలో ఎంపీడీవో తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జాగరపు రాంబాబు

నాతవరం: గిరిజన ప్రాంతమైన సుందరకోట పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో జాగరపు రాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ పాఠశాల భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ప్రైవేటు భవనంలో నడుస్తున్న పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం మెనూ, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ తదితర అంశాలపై ఆరాతీశారు. గ్రామంలో ప్రధాన సమస్యను గ్రామపెద్దలను అడిగి తెలుసుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సెక్టార్, నోడల్ అధికారులను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా కీలకమన్నారు. డిస్ట్రిబ్యూషన్ సమయంలో ఈవీఎంలను భద్రపరిచే స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద అన్ని సౌకర్యాలు ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సెక్టార్, పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నగదు, మద్యం పంపిణీ ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

వెలంకాయలపాలెంలో జలజీవన్ మిషన్ పనులు



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

రోలుగుంట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో కొండపాలెం పంచాయతీ వెలంకాయలపాలెంలో ఇంటింటా కుళాయిల ఏర్పాటు కోసం జలజీవన్ మిషన్ పథకం కింద రూ.18.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులకు ఎంపీటీసీ సభ్యుడు గొర్లె వెంకటరామన్, మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో ఈ పనులు త్వరితగతిని పూర్తి చేయించి వినియోగంలోకి తెస్తామన్నారు. నాయకులు బెజవాడ నాగేశ్వర్రావు, సత్తిబాబు, ఎస్.కొత్తూరు సర్పంచ్ పోతల రాజశేఖర్, పడాలపాలెం సర్పంచ్ పాచిలి పాల్గొన్నారు.

మసీదు ప్రహరీ ప్రారంభం

మాకవరపాలెం: మసీదు చుట్టూ నూతనంగా నిర్మించిన ప్రహరీని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ముస్లింల విజ్ఞప్తితో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ దీని నిర్మాణానికి రూ.10 లక్షల మంజూరు చేశారు. వీటితో ప్రహరీ పనులు పూర్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి కోలా ఈశ్వరరావు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాలకు రాచబాట



నల్లకొండమ్మ తల్లి ఆలయానికి వేసిన సీసీరోడ్డు



కోటమ్మ తల్లి ఆలయానికి వేసిన సిమెంటు రోడ్డు

రూ.14 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం పూర్తి

నాతవరం: నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చొరవతో రెండు దేవాలయాలకు వెళ్లే భక్తులకు రవాణా కష్టాలు తొలగాయి. రూ.14 లక్షలతో సీసీరోడ్లను నిర్మించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షలతో నాతవరంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో తాండవ కాలువ సమీపంలో నల్లకొండమ్మ ఆలయం నిర్మించారు. ఈ ఆలయాన్ని గతేడాది ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టరు రవిపట్టన్‌శెట్టి ప్రారంభించారు. ఆ సమయంలో ఆలయానికి వెళ్లే తాండవ కాలువ గట్టు మట్టిరోడ్డు కావడంతో ఏమాత్రం వర్షం పడినా భక్తులు రాకపోకలు సాగించడానికి బురదమయంగా తయారవుతోందని, సిమెంటు రోడ్డు నిర్మాణం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.6 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నల్లకొండమ్మ ఆలయం వరకు తాండవ కాలువ గట్టుపై సీసీరోడ్డు నిర్మించారు. అదేవిధంగా నాతవరం గ్రామస్తులు గ్రామదేవతగా పూజించే కోటమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా ఉండేది. ఈ రోడ్డు దుస్థితిపై అప్పటి వైఎస్సార్‌సీపీ నేత దివంగత అంకంరెడ్డి జమీలు ఎమ్మెల్యే, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు తెలిపారు. రూ.8 లక్షలు మంజూరు చేయగా, శరవేగంగా నిర్మించారు. ఈ రెండు ఆలయాలకు నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ఆధ్వర్యంలో సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.

రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన



శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బూడి

చీడికాడ: మండలంలోని రూ.78 లక్షలతో వరహాపురం నుంచి దిబ్బపాలెం మీదుగా విజయరామరాజు పేట (బుచ్చెయ్యపేట మండలం) వెళ్లే తారు రోడ్డు పనులకు దిబ్బపాలెం వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మట్టిరోడ్డును తారురోడ్డుగా నిర్మించారన్నారు. నాటి నుంచి నేటి వరకు 18 ఏళ్లలో వచ్చిన పాలకులు శిథిలమైన ఈ రోడ్డుపై తట్టెడు మట్టిపోయలేదన్నారు. నేడు వైఎస్ తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పునర్నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మాడుగుల నియోజకవర్గంలో దాదాపుగా అన్ని రోడ్లను పూర్తి చేసినట్టు అయిందన్నారు. దీంతో ఒక్కసారిగా జై జగన్, జై బూడి అని కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ నందారపు రమణబాబు, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, చుక్కా అప్పలనాయుడు, గొల్లవిల్లి స్వామినాయుడు, కోన అర్జున, కోవెల జగన్, బుసార రామకృష్ణ, ఎంపీటీసీ దారపు పెద్దనాయుడు, దారపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ కమిటీల పాత్ర కీలకం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: పోలింగ్ బూత్‌లకు ఓటర్లను తీసుకొచ్చి ఓటు వేయించడంలో బూత్ కమిటీ సభ్యులు కీలకపాత్ర వహించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఏ సమయానికి ఎంత మంది వచ్చి ఓటు వేశారు, ఇంకా మిగిలిన ఓటర్ల వివరాలు బూత్ లోపల ఏజెంట్లకు మాత్రమే తెలుస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ రోజున బూత్ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల నాయకులు సమష్టిగా పని చేయాలన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ, కులం చూడకుండా సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న తనను రెండోసారి గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికులా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, మాజీ సర్పంచ్ సుంకరి గాంధీ, స్కూల్ కమిటీ చైర్మన్ పాతాళ సత్తిబాబు, ఉప సర్పంచ్ శనివాడ అప్పారావు, పాలబాబు, సుంకరి గోవింద పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి భాస్కరరావు

మాడుగుల రూరల్: 2019 నుంచి నేటి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఒమ్మలిలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొద్దాపు భాస్కరరావు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. అమ్మఒడి, రైతు భరోసా, తదితర నవరత్నాల లబ్ధితో పేదల ఆర్థిక సమస్యలు తీరాయన్నారు.

చోడవరంలో పాత చెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన విప్ ధర్మశ్రీ



చోడవరం పట్టణంలో పాత చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: చోడవరం పట్టణంలో పాత చెరువును పార్కుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పట్టణంలో పాత చెరువు ట్యాంక్ బండ్‌ను పార్కుగా అభివృద్ధి చేసేందుకు రూ. 60 లక్షలు మంజూరు కావడంతో పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పీఎస్ పేట, ఖండిపల్లి, భోగాపురం గ్రామాల్లో కూలీలు, కార్మికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగినంత అభివృద్ధి ఏ ప్రభుత్వములోనూ చేయలేదన్నారు. సంక్షేమ, అభివృద్ధి రెండు లక్ష్యంగా పనిచేసిన తమ ప్రభుత్వానికి ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వాలని కోరారు. ఇళ్లులేని నిరుపేదలందరికీ సొంతింటి కల నిజం చేయాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. ట్యాంక్ బండ్ పనులు త్వరలోనే వేగవంతమవుతాయన్నారు. పనిచేసే కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌లు బండి నూకాలమ్మశ్రీను, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రూ.4.45 లక్షల సీఎం సహాయనిధి మంజూరు



బుచ్చెయ్యపేటలో బాధితులకు చెక్కులు అందిస్తున్న సూర్య

బుచ్చెయ్యపేట: మండలంలో అనారోగ్యంతో వైద్య సేవలు పొందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4.45 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన సంఘం నాయకుడు కరణం సూర్య శుక్రవారం బుచ్చెయ్యపేటలో పంపిణీ చేశారు. ఐయితంపూడికి చెందిన మలిరెడ్డి రాముకు రూ. 30 వేలు, లోపూడికి చెందిన చప్పా వరలక్ష్మికి రూ.65 వేలు, పీపీ అగ్రహారానికి చెందిన బొబ్బిలి రాజుకు రూ.28 వేలు, సీతయ్యపేటకు చెందిన దాకవరపు నాగేశ్వరరావుకు రూ.35 వేలు, రాజాంకు చెందిన మూతూరి సత్యారావుకు రూ.60 వేలు, వడ్డాదికి చెందిన కోవెల రామకృష్ణకు రూ.75 వేలు, చినప్పనపాలెంకు చెందిన సరిపల్లి రాజుకు రూ.52 వేలు, రాజాంకు చెందిన ధనిషిక్‌కు రూ.1.10 లక్షల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు

రావికమతం: కొత్తకోట మెయిన్ స్కూల్‌లో పోలింగ్ బూత్‌లను సీఐ ఎల్.అప్పలనాయుడు, వీఆర్వో లక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఇక్కడ బాత్‌రూం, మరుగుదొడ్డి, గాలి, వెలుతురు, దివ్యాంగులకు ర్యాంప్ సౌకర్యం వంటివి మరొక సారి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో బూత్‌లను మరొక్కసారి పరిశీలిస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు



ప్రభుత్వ భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

నాతవరం: హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన భూములను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఎస్.రమేష్ కుమార్, ఎస్సై రామారావు హెచ్చరించారు. శుక్రవారం వల్సంపేటలో సర్వే నెంబరు 170లో రెండెకరాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించడంతో సర్పంచ్ ఇటంశెట్టి శ్యామల, మాజీ సర్పంచ్ సుర్ల యోగీశ్వరుడుల మధ్య వివాదం నెలకొందన్నారు. ఈ విషయమై ఇరువర్గాలతో మాట్లాడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఆ భూమిని ఎవరైనా ఆక్రమించినా చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు. ఇప్పటికే ఇరువర్గాలకు చెందిన 15 మందిని బైండోవర్ చేశామన్నారు.

గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో రాంబాబు

నాతవరం: గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధికారులకు సూచించారు. సర్పంచ్ గంగారాజు అధ్యక్షతన సరుగుడు గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ లక్ష్మణమూర్తి హాజరై మాట్లాడారు. సచివాలయాల ద్వారా గిరిజనులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో జాగరపు రాంబాబు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గిరిజనులు మండల కేంద్రానికి రావల్సిన పని లేదన్నారు. అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందుతున్నాయన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తొలుత గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో సందర్శించి రికార్డులను పరిశీలించారు. తడిపొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చినబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

గొలుగొండ: పుత్తడిగైరంపేటలో అభయాంజనేయ ఆలయ నిర్మాణ పనులకు సర్పంచ్ పత్తి రమణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఇక్కడ ఎస్సీ కాలనీ సమీపంలో ఆలయం నిర్మిస్తున్నామన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ఇంటి రిజిస్ట్రేషన్ పట్టా చూపిస్తున్న లబ్ధిదారు

గొలుగొండ: చీడిగుమ్మలలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో 133 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు కాగా, వారిలో శుక్రవారం 101 మందికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. మిగతా వారికి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడంతో పాటు వాటిని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చరిత్రాత్మకమన్నారు. సర్పంచ్ కాపారపు చిన్నబ్బాయి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, చీడిగుమ్మల సహకార బ్యాంక్ చైర్మన్ రామకృష్ణ, వీఆర్వో రాజు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న వెంకటరావు, తాతయ్యబాబు

కె.కోటపాడు: జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌ను పైసా ఖర్చు లేకుండా సీఎం జగన్ చేయిస్తున్నట్లు రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టరు ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు తెలిపారు. శుక్రవారం మేడిచర్లలో జగనన్న కాలనీల్లో 16 మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు సొంత గూడును కల్పించి ఇంటి రిజిస్ట్రేషన్‌తో సర్వహక్కులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.రాజు, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.



పట్టాలు అందజేస్తున్న సర్పంచ్ వెంకట గౌరీదేవి

24 మందికి పట్టాలు పంపిణీ

మాడుగుల రూరల్: తాటిపర్తి సచివాలయంలో 18 మందికి ఫ్రీ హోల్డ్ పట్టాలను సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి శుక్రవారం పంపిణీ చేశారు. జగనన్న కాలనీకి సంబంధించి ఆరుగురు లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అందజేశారు. మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవిరావు, వీఆర్వో కుదర ఏడుకొండలు, కార్యదర్శి ఎస్. నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి స్పందన




జానకిరాంపురంలో రోగుల పేర్లు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

మాకవరపాలెం: తామరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం-2లో 250 మందిని వైద్యాధికారి ప్రత్యూష పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతోపాటు స్థానికులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా రక్తహీనత నివారణపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి గురువారం పంపిణీ చేస్తున్న ఐరన్ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రరావు, తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, సర్పంచ్ చెల్లారత్నం, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: జానకిరాంపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం-2 శుక్రవారం నిర్వహించారు. జనరల్ డాక్టరు ధనలక్ష్మి, గైనికాలజిస్ట్ అనిషా, ఈఎన్‌టీ డాక్టరు కనకలక్ష్మి 395 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని కొప్పుల వెలమ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి.రమణ ప్రారంభించారు. సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ఏఎన్ఎం కల్యాణి, సిబ్బంది సేవలందించారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



నానాజీని సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, ఎంఈవో తాడి అమృత్‌కుమార్

నాతవరం: సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. శుక్రవారం చమ్మచింత ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రేయోభిలాషి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు నానాజీని ఘనంగా సత్కరించారు, అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన సామగ్రిని నానాజీ దాతల సాయంతో సమకూర్చారని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో తాడి అమృత్‌కుమార్, సర్పంచ్ వెలకాడ కొండబాబు, వైస్ సర్పంచ్ అప్పన దివాణం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాశపు నూకరాజు పాల్గొన్నారు.



గణిత శాస్త్రంలో మేటి భారత్



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం రూరల్: పురాతన కాలం నుంచి గణితశాస్త్రంలో భారతదేశం పేరెన్నికగన్నదని వైస్ ప్రిన్సిపాల్ పి. కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇతర దేశాల వారు సైతం గణితంలో పలు అంశాలను భారత్ వేదికల నుంచి పొందేవారన్నారు. మేథ్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఎ.కృష్ణారావు మాట్లాడుతూ గణితశాస్త్ర ప్రాధాన్యతను తెలుసుకుని విద్యార్థులు దానిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఫిజిక్స్ లెక్చరర్ సుధీర్ మాట్లాడుతూ గణితంలో పై విలువ 22బై7 గా గుర్తించినది భారతీయులు కావడం మనకు గర్వకారణమన్నారు. కామర్స్ హెచ్‌ఓడీ వి.అప్పలనాయుడు మాట్లాడుతూ గణితశాస్త్రం నిత్య జీవితంలో భాగమన్నారు. ఎస్ఎం.రఫీయుద్దీన్, ఐ.వి.వి సత్యవతి, జి.నారాయణమూర్తి, సూర్యవతి, హెచ్.జ్యోతి, ఎన్ఎస్ఎస్ పీవోలు బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, తాతారావు, పి.డి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పోస్టల్ పథకాలపై ప్రచారం



మాట్లాడుతున్న జిల్లా సూపరింటెండెంట్ సత్యనారాయణ

రావికమతం: పోస్టల్ సిబ్బంది గ్రామ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి మన శాఖలో మేలైన పథకాలను ప్రజలకు వివరించాలని పోస్టల్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం రావికమతం బ్రాంచ్‌లో ఆయన మాట్లాడారు. హర్ ఘర్ సోలార్ పథకానికి పోస్టాఫీసులో దరఖాస్తు చేసుకునే విధానంపై ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. పోస్టాఫీసులో నూతన పథకాలను వివరించారు. ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ ఉంటే పోస్టాఫీసులో సునాయాసంగా ఖాతా ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ దాచుకున్న డబ్బుకు ఇతర బ్యాంకులు కంటే ఎక్కువ వడ్డీ ఇస్తామన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ముఖ్య అధికారులు కె.శ్రీనివాసరావు, బాంధవి, పలాసరావు, సంతోష్, రావికమతం, వడ్డాది, కొత్తకోట, మాకవరపాలెం శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

రోలుగుంట: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకుగాను ప్రజలను అప్రమత్తం చేసేందుకుగాను కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎల్ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి 50 మంది పోలీస్‌లు గ్రామ వీధుల్లో కవాతు చేశారు. ఎన్నిక నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా కేసులు నమోదు తప్పదని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.